వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మెగా వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

నార్నూర్, అక్టోబర్ 8 : ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గాదిగూడ మండలంలోని ఝరి గ్రామంలో పోలీసు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్పీ కుమ్రం భీం విగ్రహానికి నివాళులు అర్పించి, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల కోసమే పోలీసులు పని చేస్తున్నారన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, నార్నూర్ సీఐ రహీంపాషా, గాదిగూడ ఎస్ఐ మహేశ్, అడిషనల్ డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్, వైద్యాధికారులు సోయిబ్దీన్, ఆదర్శ్‌రెడ్డి, నవీన్, భాగ్యలక్ష్మి, గోపాల్, సాయినాథ్, అభిజిల్, సంజీవ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు మెస్రం దేవ్‌రావు, కోడప జాకు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోశ్ పాల్గొన్నారు.

విపత్కర, యుద్ధ సమయాల్లో ఏయిర్ ఫోర్స్ సేవలు ఉపయోగం

- కలెక్టర్ రాజర్షి షా

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, అక్టోబర్ 8 ః విపత్కర, యుద్ధ సమయాల్లో ఏయిర్ ఫోర్స్ సేవలు ఉపయోగపడుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఇండియన్ ఏయిర్ ఫోర్స్ డేను పురస్కరించుకుని సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ గౌష్ ఆలం, యాపల్‌గూడ రెండో బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్‌తో కలిసి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఇందులో భాగంగా ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిన చిన్నారి సాయి లోహిత్‌ను సత్కరించారు. ఆర్మీ కోటలో ముగ్గురికి ఎంబీబీఎస్‌లో సీట్లు రావడంతో వారికి లెటర్లను అందించారు. సైనిక సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, కెప్టెన్ మజర్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సహకార ఉద్యోగి మృతి

తాంసి(భీంపూర్), అక్టోబర్ 8 : భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన సహకార ఉద్యోగి కర్నేవార్ గణేశ్(52) ఈ నెల 4వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, సీఈవో కేశవ్, మేనేజర్ రవి, మాజీ సీఈవో లక్ష్మణ రాజు, డైరెక్టర్ అశోక్ రెడ్డి, జిల్లాలోని బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 8 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి కలెక్టర్ రాజర్షి షా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్డీవో, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, మార్కెటింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వచ్చే 150 రోజులపాటు కొనుగోళ్ల సేకరణను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలు తలెత్తకుండా, నిర్లక్ష్యం వహించకుండా కొనుగోలు చేపట్టాలని సూచించారు. కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ముందస్తు ప్రణాళికతో అన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఆధార్‌తో అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాతో మాత్రమే సీసీఐ వారు డబ్బులు జమ చేస్తారని తెలిపారు. అనుసంధానం లేకపోతే ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రానికి రైతులు వచ్చేటప్పుడు తమ వెంట తప్పకుండా ఫొటో గుర్తింపు కలిగిన రెండు జతల ధ్రువపత్రాలు, ఫోన్ తప్పకుండా తీసుకురావాలని సూచించారు. ఎందుకుంటే రైతు లైవ్‌ఫొటో, వేలిముద్ర, ఐరీస్(ముఖ నిర్ధారణ), ఓటీపీ వివరాలు సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, కౌలుదారు అయితే ఏఈవోతో జారి చేసిన పత్తి పంట ధ్రువపత్రం, పట్టాదారుని పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. ఒక వేళ రైతు (పట్టాదారు లేదా కౌలుదారు) సీసీఐ కొనుగోలు కేంద్రానికి రాలేని పక్షంలో ఆ రైతు రక్త సంబంధం కలిగిన భర్త లేదా భార్య, కొడుకు, అన్న, తల్లి, తండ్రి, చెల్లెలు, పెద్దనాన్న, పెద్దమ్మ మనవడు, మనవరాలు రావచ్చన్నారు. రైతు తరపున వచ్చే ప్రతినిధి తమ ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలని, ఇతరులకు అనుమతి లేదని పేర్కొన్నారు.

కేంద్ర బృందం విస్తృత పర్యటన

బేల, అక్టోబర్ 8 : కాప్సి, మసాలా(బీ) గ్రామాల్లో ఎన్ఆర్ఎల్ఎం కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్, సెర్ప్ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సెర్ప్ అడిషనల్ ఏపీడీ నిలయ్య మాట్లాడుతూ.. ఎన్ఆర్ఎల్ఎం కేంద్ర బృందం సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ, సెర్ప్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సభ్యులు, మహిళా స్వశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తెలుసుకున్నారు. వారి వెంట అధికారులు ఏపీడీ కుటుంబ రావు, ఎంపీడీవో మహేందర్ కుమార్, ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

సెర్ప్, ఉపాధి హామీ పనుల వివరాలను తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రకృతికే అందం మన బతుకమ్మ

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 8 : ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబురమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగులతో కలిసి ఆడి పాడారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు ఆనందంగా పాల్గొని కలెక్టరేట్‌కు కొత్త శోభను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి పాల్గొన్నారు.

బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పాఠశాలల అభివృద్ధికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- భూమిపూజ అభివృద్ధి పనులకు

బోథ్, అక్టోబర్ 8 ః పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బాబేరతండా ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని గుర్తు చేశారు. అనంతరం జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సురేందర్ యాదవ్, డాక్టర్ స్వామి, బాబూసింగ్, రూప్‌చంద్, రావ్‌జీత్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 43 మంది లబ్ధిదారులకు రూ.12.57 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను, రూ.98 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. డీటీ మల్లేశ్, ఆర్ఐ సునీత పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తాంసి(భీంపూర్), అక్టోబర్ 8: భీంపూర్ మండలం మర్కగూడ గ్రామానికి చెందిన వెడ్మ జలపతి అదృశ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. జులై 24న జలపతి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే చుట్టు పక్కల బంధువులకు సమాచారం చేరవేసిన ఫలితం లేకపోయింది. తల్లి దేవత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కలీం తెలిపారు.

గాంధీపార్కులో దంపతుల ఆత్మహత్యా యత్నం

ఎదులాపురం, అక్టోబర్ 8: ఆదిలాబాద్ జిల్లాలో దంపతుల ఆత్మహత్యాయత్నం ఘటన చోటు చేసుకుంది. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన గౌడ్ రాజు(25), గౌడ్ వైష్ణవి(22) దంపతులు ఆదిలాబాద్‌లోని గాంధీ పార్కులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కొద్ది రోజులుగా మాండగడలోని పుట్టింట్లో ఉంటున్న వైష్ణవి మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చి భర్తకు ఫోన్ చేసింది. మాటమాట పెరిగి ఒకరికి ఒకరు గొడవ పడ్డారు. ఒక్కసారిగా గౌడ్ వైష్ణవి తనతో తీసుకువచ్చిన పురుగుల మందు తాగింది. గమనించిన భర్త మిగిలిన పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే ఆటో ఎక్కించి రిమ్స్‌లో చేర్చారు. జరిగిన విషయం వైద్యులకు తెలిపారు. కాగా తరచూ భార్యభర్తల మధ్య గొడవ, కుటుంబ సభ్యుల మధ్య కలహాలు ఉండేవి. బాధలు తట్టుకోలేకనే పురుగుల మందు తాగినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ రిమ్స్‌కు వెళ్లి ఘటనపై విచారణ చపట్టారు. అమ్మాయి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతం రిమ్స్‌లో దంపతులిద్దరు చికిత్స పొందుతున్నారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

సారంగాపూర్, అక్టోబర్ 8: సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో కరెంట్‌షాక్ గురై ఒకరు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మడేపల్లి గ్రామానికి చెందిన గేడం సంతోష్ (26) స్వర్ణ గ్రామానికి చెందిన బోడకుంటి రాజేశ్వర్ వద్ద కొంతకాలంగా వ్యవసాయ పనులకు పాలేరుగా ఉన్నాడు. స్వర్ణ గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. సంతోష్ అప్పుడప్పుడు యజమాని పత్తి చేను సమీపంలో స్వర్ణవాగు నందు చేపలు పటేందుకు సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా కూడా ఇంటికి తిరిగి రాలేదు. సంతోష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా మంళవారం ఉదయం 10 గంటలకు స్వర్ణ గ్రామ శివారులో గుజ్జుపెద్ద ముత్యం చేను వద్ద సంతోష్ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకున్నాడు. ప్రాథమిక విచారణలో మృతుడు సంతోష్ చేపలు పట్టడానికి ఎలాంటి అనుమతులు లేకుండా గుజ్జుపెద్ద ముత్యం చేనులోని పంపుసెట్ నుంచి కరెంట్ కనెక్షన్ తీసుకున్నాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడు తండ్రి అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు సంతోష్‌కు సంవత్సరం క్రితం వివాహం జరిగింది.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం

ఎదులాపురం, అక్టోబర్ 8 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసేలాయత్నాలు సాగిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ ఆరోపించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్లు కార్మికులపై అనుసరిస్తున్న విధానాల గురించి చర్చించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం అప్పగించేలా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. దీని కారణంగా కార్మికుల బతుకులు చిన్నభిన్నం అవుతాయన్నారు. ప్రజలు కొనుగోలు శక్తిని తగ్గించారని ఆరోపించారు. కొనుగోలు శక్తి లేకపోతే పరిశ్రమలు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్యం

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో ‘రియల్’ డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై ‘రియల్ ఇన్‌సైట్’ పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహ మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షల్లో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండు మల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్కును అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షల్లో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ర్టానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్ఎస్ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.